ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

'పొలం పిలుస్తోంది'తో రైతులకు మేలు

ప్రజాశక్తి -అనంతగిరి: పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని సర్పంచ్ కిల్లో. మొస్య అన్నారు. మండలంలోని టోకూరు పంచాయతీ సర్పంచ్ మొస్య ఆధ్వర్యాన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ,రైతులకు లాభం వచ్చే విధంగా ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ, ఇప్పటి వరకు చాలా మంది రైతులకు పిఎం కిసాన్ రైతు భరోసా అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, టీడీపీ నాయకులు కిముడు కలరాజు, చిన్నయ్య, ఎగ్రికల్చర్ అసిస్టెంట్ ఉష పాల్గొన్నారు

అవగాహన కల్పిస్తున్న ఎఒ

పాడేరు ఆసుపత్రిలో రోగుల అవస్థలు

- పని చేయని సిటి స్కానింగ్ యంత్రం - మందుల కొరతతో వెతలు

పాడేరు సర్వజనాసుపత్రి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సర్వజనాసుపత్రిలో సిటీ స్కానర్ పనిచేయలేదు. దీంతో, రోగులు, క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్కానింగ్ అవసరమైన రోగులు, ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు వైద్య సేవలు పూర్తిగా అందడం లేదు. రోగ నిర్ధారణతో పాటు ఎముకల పరిస్థితిని అంచనా వేసేందుకు ఎంతో ఉపయోగపడే సిటీ స్కానర్ పని చేయక పోవడంతో ఆసుపత్రిలో రోగులు అవస్థలు పడుతున్నారు. చేసేది లేక పలువురు రోగులకు ప్రైవేటు కేంద్రాలే దిక్కవుతున్నాయి.

పేదలకు మంచి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంగా పాడేరు సర్వజనాసుపత్రికి అధ్యయధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిటీ స్కానర్ ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రిలో ఎక్సరే, రక్త పరీక్షలు, డయాలసిస్, ఆపరేషన్ థియేటర్ విభాగం వంటివి ఉన్నాయి. రోగిని పరీక్షించే క్రమంలో డాక్టర్లు వ్యాధి పలానా అని తెలుసుకునేందుకు సిటీ స్కాన్, ఎక్సరే వంటి వాటి ద్వారా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు. ఆసుపత్రిలో సెప్టెంబర్ 15 నుంచి సిటీ స్కాన్ పనిచేయక పోవడంతో, ఖర్చు ఎక్కువైనా సరే మైదాన ప్రాంతాలకు వెళ్లి సిటీ స్కాన్ సెంటర్లను, బయట సెంటర్లను ఆశ్రయించి స్కానింగ్ చేయించుకోక తప్పడం లేదు. స్తోమత లేని పేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సిటీ స్కానర్ సుమారు నెల రోజులు అవుతున్నప్పటికీ మరమ్మత్తులకు నోచుకో లేదు. ఉన్నతాధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సిటీ స్కాన్ త్వరగా అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని రోగులు కోరుతున్నారు.

ఆసుపత్రిలో మందుల కొరత రోగులను వేధిస్తోంది.

మందుల కొరత ఉన్న కారణంగా ప్రైవేట్ దుకాణాలకు పంపిస్తున్నారు. చికిత్స కోసం వచ్చిన రోగులు కొన్ని రకాల మందుల కోసం బయటకు వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో కొందరు రోగులతో మాట్లాడగా ఐవి ఫ్లూయిడ్స్ లేవని చెప్పినట్టు వెల్లడించారు. ఎక్సరే, స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకోవడం రోగులకు పెద్ద పరీక్ష గానే చెప్పాలి. రోగులు ల్యాబ్ లో రక్త నమూనాలు ఇస్తున్నారు. కానీ రిపోర్టులు మాత్రం మరుసటి రోజు వస్తున్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాళం వేసి ఉన్న సిటి స్కాన్ గది

బయట కొనుక్కోవాల్సి వస్తోంది

నా భర్తకు ఆసుపత్రిలో చికిత్స చేయించా. వైద్యులు రాసిన మందులు ఆసుపత్రిలో లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో కొనాల్సి వచ్చింది. రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.

-చిన్నారి, పాడేరు

ఆసుపత్రిలోనే అన్ని మందులు ఇవ్వాలి

వైద్య పరీక్షల అనంతరం వైద్యులు మందులు రాశారు. వైద్య సిబ్బంది మూడు రకాల మందులు ఇచ్చారు. మిగతావి బయట తీసుకోవాలని చెప్పారు. దీంతో ప్రైవేట్ దుకాణాల్లో కొనాల్సి వచ్చింది. ఆసుపత్రిలోనే అన్ని మందులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ప్రకాష్, సుండ్రుపుట్టు

నివాళి అర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధాన ఉపాధ్యాయుడు టి.మోహన రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉదయ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు పిల్లలను ప్రేమించే తత్వం ఉండాలని తెలిపారు. శారదా నికేతన్ పాఠశాల పీఆర్వో యల్లపు పైడియ్య మాట్లాడుతూ, పేద కుటుంబం నుంచి వచ్చిన కలామ్ అత్యంత ఉన్నత పదవిని అలంకరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి త్రినాధ్‌రావు, ఉపాధ్యాయులు రాజారాం, మీనా, ఝాన్సి పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఐద్వా నాయకులు

కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-ముంచంగిపట్టు: మండలంలోని కించాయిపుట్టు గ్రామ పంచాయతీ సచివాలయం కార్యదర్శి గోపికి బదిలీ కావడతో ఐద్వా అధ్యక్షురాలు ఎస్ ఈశ్వరి , కార్యదర్శి ఎస్.విజయలు ఘనంగా సన్మానించారు. మండల వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ మాట్లాడుతూ, అంకితభావంతో ప్రజల పట్ల సచివాలయంలో సేవలు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించదంలో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఫాస్టర్, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం: కూనవరం మండలంలోని చేపల బజార్‌లోని వరద బాధితులకు విఆర్ పురం బిసి కాలనీ ఫాస్టర్ ఏసురత్నం, సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, కూనవరం సీనియర్ నాయకులు నాగరాజు, తాలూరి శ్రీను ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలకు సర్వం కోల్పోయిన చేపల బజార్ గ్రామస్తులకు తమ వంతుసాయంగా వీటిని అందజేస్తున్నామన్నారు. వరద సమస్య శాశ్వత పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామని, ప్రభుత్వాలు మారినా బాధితుల జీవన స్థితిగతుల్లో మార్పులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరానికి సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులు, తమ హక్కుల సాధనకు పోరాడుదామన్నారు. ఫాస్టర్ యేసురత్నం మాట్లాడుతూ వరదల సమయంలో బాధితులు పడిన కష్టాలు తనకు తెలుసునని, తనవంతుగా ఈ సాయం చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కూనవరం మండల సిపిఎం సీనియర్ నాయకులు షణ్ముఖరావు, విఆర్ పురం నాయకులు సిహెచ్ సుబ్బారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చినుకురాలితే రాకపోకలకు ఇక్కట్లు

- చౌడురాయి వంతెన వద్ద రహదారి పరిస్థితి ఇది
- శాశ్వతంగా పటిష్టం చేయాలని గిరిజనం వినతి

చౌడురాయి వంతెన వద్ద బురదమయంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి -సీలేరు: గుమ్మరేవుల పంచాయతీ, చోడురాయి వంతెన, రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గత నెల 8న కురిసిన భారీ వర్షాలకు చోడురాయి వంతెన రహదారి వరదలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే తాత్కాలిక మరమ్మతుల్లో కేవలం మట్టివేసి, రాకపోకలకు వీలు కల్పించడంతో వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయమై రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుమ్మరేవులు మాదిగమల్లు చోడురాయి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వర్షం కురిస్తే చోడరాయి వంతెన వద్ద అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర సమయంలో వైద్య సేవలు నిమిత్తం సరుకులు కొనుగోలుకు 20 కిలోమీటర్ల దూరాన ఉన్న దారకొండ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆటోలు చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే నడుస్తున్నాయి. భారీ వర్షాలు వస్తే వంతెనకు ఇరువైపులా రహదారి బురదమయంగా మారి వాహనాలు కూరుకుపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చౌడురాయి వంతెన వద్ద రహదారిని, వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టి, పటిష్ట చేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఓ చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

జెసిబితో చేపడుతున్న ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్.: మండలంలోని గుమ్మకోట పంచాయతీ భీమవరంలో ఇసుక అక్రమంగా రవాణా సాగుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం చేపట్ట కూడదని ఒకవైపు ప్రచారాలు చేస్తుంటే మరోవైపు భీమవరం గ్రామంలో ఇసుక మాఫియా గెడ్డలో ఉన్న ఇసుకను జెసిబిలతో రాత్రి, పగలు తవ్వకాలు చేపడుతున్నారు.

భీమవరం గ్రామంలో పూడి మంగపతి రాజు లేఅవుట్ ఆనుకొని ఉన్న గెడ్డలో నుంచి రోజు జెసిబి లతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో మంచినీటి సమస్య ఏర్పడుతుందని చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా భీమవరం ఎర్రగడ్డ, వెంకయ్యపాలెం, కాశీపట్నం, గోస్తని గెడ్డ వాగుల నుండి నిత్యం ఇసుకను తవ్వుకు పోతున్నారు. ఈ విషయంపై స్థానికులు ప్రశ్నిస్తే వాగ్వావాదానికి దిగుతున్నారని ఆయా గ్రామాల గిరిజనులు వాపోతున్నారు.

మంగళవారం పట్టపగలు భీమవరం గెడ్డలో ఇసుకను ఏసీబీతో తవ్వుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. వీఆర్వో కోటేశ్వరరావుకి జెసిబి, ఇసుక దిబ్బలు అప్పగించారు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని గిరిజనులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి భీమవరంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను ఆపాలని చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

ఈ ఇసుక తవ్వకం విషయంపై స్థానిక వీఆర్వోను వివరణ కోరగా ...జెసిబిలతో ఇసుక తవ్వడం వాస్తవమేనన్నారు. జెసిబి డ్రైవర్ పరారయ్యారన్నారు.

తహసిల్దార్‌ను వివరణ కోరగా. ఇసుక తవ్వుతున్న జెసిబి సీజ్ చేసి ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కుప్పలుగా పోగేసిన ఇసుక

వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

కాఫీ కార్మికుల సమస్యలపై స్పందించండి

ప్రజాశక్తి-చింతపల్లి: కాఫీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకుంటే సమ్మె తప్పదని కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు యన్, కనకవల్లి తెలిపారు. కాఫీ కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి మంగళవారం ఎపిఎఫ్‌డిసి చింతపల్లి డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాఫీ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు గడుతూరి సత్యనారాయణ తో కలిసి సమర్పించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా రోజువారీ జీవన ప్రమాణానికి ఏపీ ఎఫ్డిసి ఇస్తున్న కూలి సరిపోలేదని తెలిపారు. కాఫీ తోటల సంరక్షణ కోసం యాజమాన్యం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ప్లాంటేషన్ వర్కర్స్, నాగేశ్వరరావు, పాపారావు, రాజారావు, గిరి, శివ పాల్గొన్నారు.

టూరిజం బోట్లు, రిసార్టుల నిర్వహణలో

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

- రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని టూరిజం బోట్లు, రిసార్ట్స్ నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశమందిరంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ కలిసి, టూరిజం బోట్లు, రిసార్ట్స్ యజమానులలో పాటు తహశీల్దార్లు, పోలీసులు, ఎంపిడిఒలు, గ్రామసచివాలయాల కార్యదర్శులు, పర్యాటకశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, దేవీపట్నం మండలంలోని పాపికొండల పర్యాటక కేంద్రంలో తిరిగే బోట్లు టూరిజం శాఖకు సంబంధించిన అనుమతులు పక్కాగా ఉండాలన్నారు. టూరిజం బోట్లు ఉదయం 9:45 గంటలకు బయలుదేరి తిరిగి 5,15 గంటలకు చేరుకోవాలని బోట్ల యాజమాన్యానికి సూచించారు. టూరిజం బోట్లలో టూరిస్టులకు రక్షణ కవచాలు పక్కాగాఏర్పాటు చేయాలన్నారు. టూరిజం ప్రాంతాలకు సంబంధించిన మండలాల్లో తహశీల్దార్లతో, ఎంపీడీవోలతో, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో, ఫారెస్ట్ రేంజ్ అధికారులతో పర్యాటకుల భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకుల భద్రతకు అమలు చేస్తున్న ఏర్పాట్లుపై కరపత్రాలను పంచి అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు ఒక్కొక్క బోటులో ఎంతమంది టూరిస్టులను తీసుకెళ్ళి, తెస్తున్నదీ రిజిస్టర్లో పేర్లతో సహా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తుఫాను కారణంగా ఈనెల 17వరకు పర్యటక ప్రాంతాలను నిలిపివేశామని, తుఫాను తగ్గిన తర్వాత పర్యాటక ప్రాంతాలను తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. బోటు యాజమానులు యూనియన్‌లో ఉన్నా, లేకపోయినా ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని, ఈ మేరకు వాట్సాప్ గ్రూపుల ద్వారా వారికి తెలియజేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాలలోని రిసార్ట్స్ పరిధిలోని 500 మీటర్ల వరకు పారిశుధ్య కార్యక్రమాలు రిసార్ట్స్ యాజమాన్యమే నిర్వహించాలని సూచించారు. ఏజెన్సీలో ఎంతమంది గిరిజనులు రిసార్ట్స్ నిర్వహించుచున్నది ఆరా తీశారు. ఏజెన్సీలోని రిసార్ట్స్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలలో రక్షణ కవచాల గురించి ఎక్కడికక్కడ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రంపచోడవరం నుండి మారేడుమిల్లి మారుమూల ప్రాంతాల పర్యటక కేంద్రాలలో యూటర్నింగ్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే కార్తీక మాసంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు పర్యాటకులు ఎక్కడికక్కడే చెత్తాచెదారం వేయకుండా చెత్తకుండీలను ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ బాటిల్స్, పాలిథిన్ కవర్లు, పొడి,తడి చెత్త సేకరణపై పంచాయితీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ఫాల్స్ దగ్గర ఇనుప కంచెలు, మరుగుదొడ్లు, తాగునీరు, రోడ్ల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పర్యటక బోట్లు ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేస్తామని బోట్ల యూనియన్ నాయకులు మురళి వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారులు కె. సుబ్బారావు, రామకృష్ణ, బి. రాజు, డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, సిఐలు సిహెచ్ గోపాలకృష్ణ, ఆర్‌టి రవికుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారిని అనూష, ఎంపిడిఒలు ఎస్. శ్రీనివాసరావు, జయంతి, ఎస్ఐల్లు షరీఫ్, రాము, పర్యటక శాఖ అధికారి సాంబశివరావు, పంచాయితీ కార్యదర్శులు, రిసార్ట్స్, పర్యాటక బోట్ల యాజమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

గంజాయి అనర్థాలపై అవగాహన

విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ సన్యాసినాయుడు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి.: జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ ఆదేశాలు మేరకు, రంపచోడవరం ఇన్‌చార్జి ఎఎస్‌పి. పంకజ్‌కుమార్ మీనా పర్యవేక్షణలో స్థానిక సీఐ ఎన్ సన్యాసినాయుడు ఆద్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చినబాబు రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జడ్డంగి జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గంజాయి అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ,.విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని .ఎవరూ గంజాయి జోలికి పోవద్దని హితవు పలికారు. గంజాయి నివారణకు సంబందించిన స్వచ్ఛ సంకల్పం కరపత్రాలను పంపిణీ చేశారు. గంజాయి సమాచారం తెలిస్తే గంజాయి నివారణ విభాగం నెంబర్ 9381123100కు గాని, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు 9440900765, 9440900766, రాజవొమ్మంగి సీఐ 9440900764 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు. కాలేజీలో ఈవ్‌టీజింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. గంజాయి నివారణపై విద్యార్థులతోప్రతిజ్ఞ చేయించారు.

విఆర్ పురం: విద్యార్థులు డ్రగ్స్ గంజాయి వంటి చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి ఆరోగ్యానికి విలువైన భవిష్యత్తు కోసం చక్కని బాటలు వేసుకోవాలని విఆర్.పురం ఎస్ఐ ఎస్ సంతోష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో కాలేజీ, హైస్కూల్, విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలు పాడు చేసుకోవద్దని హితవుపలికారు. ఆన్లైన్ యాప్స్, బ్యాంకింగ్ యాప్స్, రుణ యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. యువతకు క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు.

మారేడుమిల్లి: విద్యుత్ తీగలను అమర్చి, అడవి జంతువులను వేటాడితే చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తప్పవని మారేడుమిల్లి సిఐ గోపాలకృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బోదులూరు గ్రామంలో సిఐ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో అడవి జంతువుల వేటకు, పంట పొలాల రక్షణకు ఎవరైనా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే సమాచారమివ్వాలని సూచించారు. విద్యుత్ తీగలు అమర్చడం వల్ల రాత్రి సమయంలో జంతువులను తరిమే క్రమంలో తీగలు తగిలికొండపోడు రైతులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లోని యువకులు గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.. సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సారా తయారీ, అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో మారేడుమిల్లి ఎస్ఐ ఎన్ రాము నాయుడు, అధికారులు, గ్రామస్తులు యువతి యువకులు పాల్గొన్నారు

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరులోని గవర్నమెంట్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త కె.భాస్కరరావు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యాసనకు సంబంధించిన లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. డిస్లెక్సియాతో బాధపడుతున్న విద్యార్థులకు బోధించడానికి కొన్ని సాధారణ చిట్కాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విశ్వ ప్రసాద్, ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్స్ తల్లిదండ్రులు, స్థానిక ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్లో పిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కొద్దిసేపు టీచర్‌గా విద్యార్థులకు పాఠాలు బోధించి, ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి తన పెన్ను బహుమతిగా ఇచ్చారు. విద్యార్థులకు క్రికెట్ కిట్ ఇస్తానని భరోసా ఇచ్చారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ప్రభుత్వ ఇస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకోవడం ద్వారా వారి తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చాలని, భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.బాలకృష్ణ, ఉపాధ్యాయులు రమేష్, సుబ్బయ్య, పెంటమ్మ, భద్రయ్య, రత్తయ్య, రాజు, నాగరాజు, జయ, మహాలక్ష్మీ , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థినికి సొంత పెన్ను బహుమతిగా ఇస్తున్న పిఒ భరత్

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక స్పీకర్ క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని స్పీకర్ అయ్యన్న పాత్రుడు నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీటి సమస్య, వీధి లైట్ల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో వీధి దీపాలు, పారిశుధ్యం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. గబ్బాడ వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి త్వరితగతిన ఇవ్వాలని మైన్స్ ఏడిని ఆదేశించారు. ఇసుక విషయంలో దళారులను అరికట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావాలని ఆర్డీఓ, ఎమ్మార్వోలకు సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గలో రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించి తక్షణమే పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి డిఈకి ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్‌కు వంద టన్నులు తరలించామని, ఇంకా 200 టన్నులు పంపాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వివి రమణ, ఎమ్మార్వో రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, మైన్స్ ఏడి శివాజీ, ఆర్ అండ్ బి డిఈ విద్యాసాగర్, తాండవ డిఈ అనురాధ, డూమా పీడీ పూర్ణిమ దేవి పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో మహిళలే కీలకం

ప్రజాశక్తి -నక్కపల్లి: వ్యవసాయ పనులలో మహిళల ప్రాధాన్యతే కీలకమని బిసిటి – కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కర్రా అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లు గ్రామంలో మంగళవారం బిసిటి – కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళ రైతు దినోత్సవం (మహిళా కిసాన్ దివస్) నిర్వహించారు.మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక భాగస్వామ్యం కల్పించడంతోనే మహిళా సాధికారత అని అన్నారు.

బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయర్నా, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడారు. ఆదర్శ మహిళ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త నాగ అప్పలరాజు, జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారి తులసిమణి, గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధ్యతలను బొట్టు పెట్టి చెప్పాలా ?

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బాధ్యతలను బొట్టు పెట్టి చెప్పాలా అని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుండి పంచాయతీ అధికారులు, సిడిపి ఓలు, గృహ నిర్మాణ, విద్యా, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో అబివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలని సూచించారు. ఫ్రై డే డ్రైడేను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. పారిశుధ్య పనుల్లో వ్యాపార సంస్థల యజమానులను బాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ సేవల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, బాలికల సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనాథ పిల్లలను బాలల సదనంలో చేర్పించాలన్నారు. చిన్నారులను తప్పని సరిగా అంగన్వాడీలకు తీసుకుని రావాలన్నారు. చిన్న పిల్లల్లో ఉన్న లోపాలుపై తలిదండ్రులకు అవగాహన కల్పించి పోషకాహారం అందే విధంగా సూచనలు చేయాలని సూచించారు. సిడిపిఓలు నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా సమావేశాలు నిర్వహించి చైతన్యవంతం చేయాలని చెప్పారు.

ఎంపిడిఓలు బాధ్యతలను బొట్టుపెట్టి చెప్పాలా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎపిడిఓలు వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించి తనిఖీ చేయాలని చెప్పారు. సచివాలయం సిబ్బంది కార్యాలయానికి వచ్చి హాజరు వేస్తున్నారని, బయటకు వెళ్లే టప్పుడు ముఖ హాజరు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పి.యం . జన్ మన్లో 22740 గృహాలు మంజూరు చేసామన్నారు. మరో 2623 గృహాలను మంజూరు చేస్తామన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మెనూను ఫోటోలు తీసి గ్రూపులో పెట్టాలన్నారు. ఉపాధ్యాయల ముఖ హాజరు చాల తక్కవగా నమోదు చేస్తున్నారని ఉదయం 10 గంటలలోపు ముఖ హాజరు వేయాలని సూచించారు. పాఠశాలలకు తిరిగి వస్తున్న విద్యార్థులకు తప్పని సరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సమీపంలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయితీ అధికారి బి.లవరాజు, ఐసిడిఎస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి. బి.బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి. ఎల్.రజని, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, డ్వామా పి.డి. శివయ్య, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని హత్యచేసిన కొడుకు

ప్రజాశక్తి-పెందుర్తి : కన్నతండ్రి మందలించాడనే కోపంతో అతన్ని కుమారుడు హతమార్చిన ఘటన నరవ గ్రామంలో చోటుచేసుకుంది. నరవ గ్రామానికి చెందిన గోపి చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడని తండ్రి దేముడు (60) తరచూ మందలించేవాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకొని మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో పడుకొని ఉన్న తండ్రి మెడపై కత్తితో నరికి చంపాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మ్యాన్ దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీకి ఆనుకుని ఉన్న రహదారి కూడలి మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో అతి వేగంగా వస్తున్న కారు సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఢీ కొన్న ప్రమాదంలో ప్రయివేట్ సంస్థలో పని చేస్తున్న వాచ్‌మ్యాన్ దుర్మరణం చెందాడు. భీమిలి పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం, కొటానుబిల్లి గ్రామానికి చెందిన దాకమర్రి శ్రీను (40), అతని తండ్రి సూరి, శ్రీను పిల్లలు 15 ఏళ్ల దీపక్, 12 ఏళ్ల సందీప్ కలిసి విజయవాడ, కనక దుర్గమ్మ దర్శనానికి ఈ నెల 13న వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14న భీమిలి వచ్చేందుకు తగరపువలస గోస్తనీ జంక్షన్ రహదారి కూడలి వద్ద బస్సు దిగారు. కూడలి మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న కారు శ్రీనును బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి సూరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబం బతుకు తెరువు కోసం కొంత కాలం క్రితం భీమిలి వచ్చారు. భీమిలి అప్పికొండ వీధిలో ఓ ప్రయివేటు సంస్థ వద్ద మృతుడు శ్రీను వాచ్‌మ్యాన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కళ్లెదుటే తండ్రి శ్రీను మృతిచెందడంతో కుమారులు, శ్రీను తండ్రి దుఃఖానికి అవధులు లేవు. భార్య రవణమ్మ కన్నీటి పర్యంతమైంది.

పల్లె పండగలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి -యంత్రాంగం

సీలేరు: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చెక్కలమద్ది గ్రామంలో రూ.7 లక్షల ఉపాధిహామీ నిధులతో కందకాలు పనులు ప్రారంభించామని దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు వెల్లడించారు.జాబ్‌కార్డున్న ప్రతిఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని, జాబ్ కార్డు లేకుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న స్థానిక కార్యదర్శి రాజ్యలక్ష్మి వార్డు సభ్యులు కిలో. మహాలక్ష్మి మోహన్ బాబు వైయస్సార్ సి పినాయకులు పిల్లా. బుజ్జి ఉపాధి హామీ సిబ్బంది ఈసి శ్రీనివాస్ టెక్నికల్ అసిస్టెంట్ రామ్మూర్తి ఫీల్డ్ అసిస్టెంట్ బి. లింగరాజు గోవిందు స్థానిక నాయకులు బాకూరి కోటేశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీకే వీధి మండలం పంచాయతీ దుప్పిలివాడ పంచాయతీ ఎస్ నేరేడుపల్లెలో పల్లె పండగలో భాగంగా రూ.నాలుగ లక్షలతో చెరువు తవ్వకం పనులు ప్రారంభించామని సర్పంచ్ కేలేబు. కుమారి వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్ఇజిఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ములు గురునాథ్, సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు మన్మథ, సుంకరి రాము, మరి శెట్టి పొట్టు తిరుపతి పాల్గొన్నారు.

వి ఆర్ పురం: మండలంలోని పెద్ద మట్టపల్లి పంచాయతీఉమ్మడివరం మెయిన్ రోడ్డు నుంచి తమ్మాయిపేట గ్రామం వరకు రూ. 20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణపనులకు పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఉపాధి ఎపిఒ, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే, స్థానిక ప్రజలు, రైతుల కష్టాలు తీరుతాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రకాష్ రావు, ఎన్ ఆర్ జి ఈఎస్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

మారేడుమిల్లి : మండలంలోని జీయంవలస, కుండాడ పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆయా సర్పంచ్‌లుకారం వెంకటలక్ష్మి, కుండ్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గోకులం షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి ఎపిఒ రెడ్డి బాబు ఎంపిటిసి కె.సువర్ణ రాజు , మారేడుమిల్లి మండల టి.డి.పి. అధ్యక్షుడు జి శేషు కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సచివాలయ, ఉపాధి సిబ్బంది, కుండాడ ఉప సర్పంచ్ బి.రామారావు, టిడిపి నాయకులు బి. మంగిరెడ్డి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలం యం మాకవరం పంచాయతీలో కూటమి నాయకులు అందరూ కలిసి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి నిధులతో ఇంకుడుగుంత పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్‌టిసెల్ రాష్ట్ర ఎస్టీ కార్యదర్శి కోర్రు రామమూర్తి, తెలుగు నాడు విద్యార్థి విభాగం అధ్యక్షులు పోటుకూరి సన్యాసిరావు మండల ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు పుల్లయ్య, మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ లోత వీర్రాజు, మాజీ ఎంపీటీసీ కిలె బాలరాజు, శ్యామల, వరలక్ష్మి బూత్ కన్వీనర్ పొట్టుకూరి ప్రసాద్, జనసేన కార్యకర్త సంజీవరావు , కాకూరు బాలయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పల్లెల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వం లక్ష్యమని టీడీపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు, అరకు నియోజవర్గ ఇన్చార్జి సివేరి దొన్నుదొర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో బాగంగా మంగళవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీలో స్థానిక సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ఆధ్వర్యంలో 90లక్షలతో చేపట్టే దండబాడు నుండి లింబగూడ గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు, అరకు నియోజకవర్గ ఇన్చార్జి సివేరి దొన్ను దొర మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేపట్టకుండా అనేక అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా చేపడుతుందని తెలిపారు. సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ, గతంలో గ్రామాల్లో సిసి రోడ్లు కోసం శంకుస్థాపనలు జరిగాయని పూర్తి కాలేదని, అదే మాదిరిగా కాకుండా పనులకు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ గురుమూర్తి, జీవన్, టిడిపి మండల మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, నాయకులు పెట్టెలి రాము పాల్గొన్నారు.

పెదబయలు : కిత్తుకొండ గ్రామంలో పల్లె పండగను స్థానిక సర్పంచి మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతగుంట ఎంపీటీసీ మండల ఫోరమ్ అధ్యక్షులు కిమంకరి బొంజుబాబు , మాజీ ఎంపీపీ కొండయ్య, వైస్ సర్పంచ్ బొండా గంగాధరం పాల్గొన్నారు.

విఆర్.పురం మండలం మెట్టపల్లి పంచాయతీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

అనంతగిరి: పల్లె పండుగలో భాగంగా మండలంలోని కొత్తూరు పంచాయతీ గ్రామంలో 33 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు, స్థానిక సర్పంచ్ సీతయ్య ఆధ్వర్యంలో పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం ఏర్పాటు చేశారు అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.టిడిపి మండల అధ్యక్షులు బుజ్జి బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంతో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెఇ గౌతమ్, ఉపసర్పంచ్ నరేంద్ర, సెక్రటరీ వరలక్ష్మి పాల్గొన్నారు

వేములకొండలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

వేములకొండలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో జి.ఎస్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్. గోరంట్ల రవి రామ్ కిరణ్ పర్యవేక్షణలో వేములకొండ గ్రామం లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భారీ ఎత్తున వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు కార్యక్రమలో వేములకొండ వీరాస్వామి, కందుల సాయి బాబు, కంగల అబ్బాయిదొర, కుంజం రామకృష్ణ దొర, విష్ణు , సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబూరావు అన్నారు. మంగళవారం గంగవరం మండలం రాజంపాలెం గ్రామంలో పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ దొర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ రైతులకు భూములు ఉన్నప్పటికీ, వాటి ద్వారా సరైన ఆదాయం రావటం లేదని, దీంతో్ల ఆదివాసీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించలేకపోతున్నారని ఆయ ఆవేదన వ్యక్తం చేశారు .ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చెరువులు, ఇనుకుడి కుంటలు, జీడీ మొక్కల చుట్టూ కుంటల పనులు చేయిస్తున్నారని, దీని ద్వారా కూలీలకు ఉపాధి దొరుకుతుందేగానీ, రైతులకు ప్రయోజనం లేదన్నారు. ఉపాధి నిధులను వ్యవసాయానికి అనుసంధానం చేసి, వరి దుక్కి, వరి నాట్లు, కలుపుతీత, వరి కోత, వరి నూర్పిడి ,రైతుకు అవసరం అయిన చోట తుప్పలు నరికించటం వంటి పనులు చేయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆదిశలో ప్రభుత్వం, అధికారులు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు కురసం వరలక్ష్మి, బోరగ.ఎర్రమ్మ, హనుమంత రావు, చిన్నాలు దొర, సుర్ల.సత్యనారాయణ, కె. అబ్బాయి దొర,అడ్డతీగల నాయకులు పీత.ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి నాయకుల ఆదాయం పెంపునకే కొత్త మద్యం దుకాణాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టి, టిడిపి కూటమి నాయకుల ఆదాయం పెంపునకు దాదాపు అన్ని వైన్‌షాప్‌లనూ వారికే కేటాయించారని వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇక విచ్చలవిడిగా మద్యం, బెల్ట్‌షాప్‌లు వెలుస్తాయని అన్నారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో కాసేపు మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు సంపద సృష్టి అని చెప్పారని, అప్పట్లో అందరూ రాష్ట్రానికి ఆయన సంపద సృష్టిస్తారని అనుకున్నారని, కానీ మద్యం పాలసీ, వైన్‌షాప్‌ల కేటాయింపు చూసిన తర్వాత వాస్తవ పరిస్థితి అందరికీ అర్థమైందని అన్నారు. ఈ నెల 14న జరిగిన మద్యం షాప్‌ల కేటాయింపుల్లో అన్ని చోట్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి ప్రజా ప్రతినిధులకే ఎక్కువ షాప్‌లు దక్కాయని అన్నారు. రాష్ట్రంలో ఇదో పెద్ద కుంభకోణమన్నారు. 2019లో తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 43 వేల బెల్టుషాప్‌లను రద్దు చేశామని, అలాగే 4500 వైన్‌షాప్‌లు ఉంటే వాటిని 2900కి తగ్గించామని, ఆ విధంగా పేద కుటుంబాలను రక్షించి, వారిని మద్యం బారి నుంచి కాపాడాలని చూశామని అమర్‌నాథ్ చెప్పారు. నాడు వాలంటీర్ల ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తే ఇప్పుడు చంద్రబాబు ఇంటింటికీ మద్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో వీధికో బెల్టు షాప్ ఉంటుందని, అలాగే ఇంటికే మద్యం సరఫరా మొదలుపెడతారని తెలిపారు. కీలకమైన విద్య, వైద్య రంగాలను చంద్రబాబు పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు.

భూమీలేదు.. బతికే మార్గమూలేదు

నమ్మి మోసపోయిన రైతులు - పనిచేసే కంపెనీలో కరువైన భద్రత
సెజ్‌లో అభిజిత్ ఫెర్రో టెక్ మూతతో కార్మికుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం మండలం, చిప్పాడ పంచాయతీ, తలదిబ్బకు చెందిన రాజాన రాము కుటుంబానికి 19 ఎకరాల భూమి వుండేది. నలుగురు అన్నదమ్ములు కలిసి వ్యవసాయం చేసుకొని బతికేవారు. వ్యవసాయ పనులకు తమ కుటుంబ సభ్యులతో పాటు అవసరమైనప్పుడు కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేసుకునేవారు. సెజ్‌కు భూములు తీసుకున్నాక వీరి బతుకు ఒక్కసారి తిరగబడింది. ఎకరాకు రూ.2.90 లక్షల చొప్పున 19 ఎకరాలకు చెల్లించిన సొమ్మంతా ఖర్చయిపోయింది. వ్యవసాయ భూమి చేతిలో లేకుండా పోయింది. కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేసుకొనే ఆ రైతు ఇప్పుడు అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని అభిజిత్ ఫెర్రోటెక్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. కుటుంబం గడవక ఆయన భార్య ఆర్.రామలక్ష్మి కంపెనీ కార్యాలయంలో చిన్నపాటి పనిచేస్తోంది. ఇద్దరూ కలిసి కంపెనీలో పనిచేసి ఆడపిల్లను చదివించుకుంటున్నారు. ఇక్కడ రాము జెసిబి మెకానిక్‌గా పనిచేస్తుంటే, వారి ముగ్గురు సోదరుల్లో ఇద్దరు కళాసీ పనిచేస్తున్నారు. కంపెనీ మూసేయడంతో తామెలా బతకాలోనని ఇప్పుడు వారంతా తల్లడిల్లుతున్నారు.

అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగిన కార్మికులు

సోమవారం అభిజిత్ ఫెర్రోటెక్ కంపెనీని మూసేయడంతో రాము, రామలక్ష్మి వంటి అనేక కుటుంబాలు బతుకు కోసం వెతుకులాడాల్సివస్తోంది. చెమటలు పట్టిన ముఖాలతో కంపెనీ గేట్ల ముందు కార్మికులు నిలబడటం పలువురిని కలిచివేసింది. తామెలా బతకాలన్న ప్రశ్నలు కార్మికుల చుట్టూ తిరుగుతున్నాయి. పరిశ్రమల కోసం భూములిస్తే రైతు బతుకు మారదన్న నిజం రైతుకు అర్థమవుతోంది. ఒక్కో పరిశ్రమ ద్వారా ఒక్కో వాస్తవం బయటపడుతోంది. పరిశ్రమాధిపతులపై ప్రభుత్వం చూపుతున్న జాలి భూములు కోల్పోయిన బాధిత రైతులు, పేదలపై చూపడంలేదు. సెజ్‌లో భూమంతా పోయాక కుటుంబాలను, ఊరును విడిచివెళ్లలేక కొద్దిపాటి జీతాలకు ఇక్కడి వారంతా అభిజిత్ ఫెర్రోటెక్‌లో ఉపాధి కోసం పనిలో చేరారు. మునగపాక, కశింకోట మండలాల నుంచి వెయ్యి మంది కార్మికులు ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. చట్ట విరుద్ధంగా ఫెర్రో టెక్ యాజమాన్యం కంపెనీని మూసేయడంతో వెయ్యి మంది కార్మికులకు ఉపాధి పోయింది. సెజ్‌లో భూములు కోల్పోయిన రైతుల్లో అత్యధికులు అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ ప్రారంభం నుంచీ పనిచేస్తున్నారు. వేరొక చోట పనిచేయడానికి మరో పని వీరికి అలవాటులేదు. దీంతో కాంట్రాక్టర్లు చెల్లించిన వేతనం తక్కువైనా సర్దుకొని వెళ్లిపోతున్నారు.

కంపెనీ నష్టాల్లోలేదని, పాలుపొంగినట్లు కంపెనీకి లాభాలొస్తున్నాయని కార్మికులు అంటున్నారు. పదేళ్ల నుంచి హౌస్ కీపింగ్ పనిచేస్తున్న తనకు పది వేలుకు మించి ఇవ్వడం లేదని ఎస్ఇజెడ్ కాలనీకి చెందిన కూండ్రపు కుమారి వాపోయింది. గతంలో పదో తేదీలోపు ఇచ్చే జీతాన్ని ఇప్పుడు 22-25 మధ్య చెల్లిస్తున్నారని తెలిపింది. జీతాలు సకాలంలో ఇవ్వకపోయినా సర్దుకొని వెళ్తిపోతున్న తమను ఇలా రోడ్డున పడేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తోంది. బికాం కంప్యూటర్ పూర్తి చేసిన ఎల్.ప్రసాద్ 2012 నుంచి ఇటిటి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. స్కిల్డ్ వర్క్ కలిగిన అతనికి రోజుకు రూ.614ను మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నాడు.

గతంలోనూ కంపెనీ మూత

కార్మికులను పర్మినెంట్ చేయబడుతుందని 2015 డిసెంబరు నుంచి 2016 జూన్ వరకు అభిజిత్ కంపెనీని యాజమాన్యం మూసేసింది. కంపెనీ తెరిచాక పాతవారిని కొత్తగా పనిలోకి తీసుకుంటున్నట్లు కాంట్రాక్టర్ల ద్వారా పనిలోకి తీసుకుంది. మళ్లీ నష్టాల పేరుతో సోమవారం కంపెనీ మూసేసి కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. యాజమాన్యం కంపెనీని మూసివేయడంతో కార్మిక కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. తామిప్పుడు ఎక్కడకు పనిలోకి వెళ్లగలమని వారంతా వాపోతున్నారు. చట్ట విరుద్ధంగా కంపెనీని మూసేసిన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకొని, కంపెనీని తెరిపించి కార్మికులకు పని కల్పించాలని మంగళవారం సిఐటియు నేతృత్వంలో కార్మికులు ఆందోళన చేపట్టారు.

కామర్స్ మేనేజ్‌మెంట్‌లో రత్నకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు మాటూరి రత్నకుమారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఎ – హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ పబ్లిక్ సెక్టార్ – ఎ స్టడీ ఆన్ సెలెక్ట్ పబ్లిక్ సెక్టార్ ఆర్గనైజేషన్స్ ఇన్ విశాఖపట్నం అనే అంశంపై జరిపిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టరేట్ ఉత్తర్వులను ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయ రావు చేతుల మీదుగా స్వీకరించారు. మాటూరి రత్నకుమారి ప్రస్తుతం ఎన్ఎస్‌టిఎల్‌లో ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను గైడ్ ఆచార్య డాక్టర్ వి.కృష్ణమోహన్, కామర్స్ డిపార్టుమెంట్ హెచ్ఒడి డాక్టర్ జాలాది రవి తదితరులు అభినందించారు.

కక్షతోనే వైసిపి నేతలపై తప్పుడు కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయ దురుద్దేశంతోనే టిడిపి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో వైసిపి నేతలపై తప్పుడు కేసులు పెడుతోందని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పశ్చిమ నియోకవర్గం 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేసినందుకు నిరసనగా మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో వైసిపి నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి బెదిరించి వైసిపి నేతలను టిడిపిలో చేర్చుకోవాలని చూస్తున్నారన్నారు. టిడిపి నేతల కేసులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. టిడిపి నేతల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. తప్పుడు కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. పివి.సురేష్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని ఆరోపించారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను బుధవారం నిర్వహించనున్నట్టు జెడ్‌పి సిఇఒ పి.నారాయణ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకూగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగాయని తెలిపారు. స్థాయీ సంఘ సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

అపరాల విత్తనాలు పంపిణీకి వినతి

ప్రజాశక్తి - దేవీపట్నం : మండలంలో రబీసీజన్‌లో మినుములు, పెసర వంటి అపరాల పంటల విత్తనాలను రాయితీపై పంపిణీ చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రశాంతిని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. మంగళవారం శరభ వరం రైతు మిత్ర కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎఒ స్పందిస్తూ, పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సాగు, సస్యరక్షణపై సూచనలు చేస్తున్నామని, అందులో భాగంగా రైతుల కోరిక మేరకు తొంభై శాతం రాయితీపై ఆదివాసి గిరిజన రైతులకు విబిఎన్.8 రకం మినుములు పంపిణీ చేశామన్నారు. ఇక్రాప్‌లో వరిపంటగా నమోదుచేసుకున్న రైతులకు రాయితీపై అవరాల విత్తనాలు ఇవ్వడం లేదని, మెరక పొలాల్లో సాగురైతులు 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జీరాక్స్ ఫోన్ నెంబర్‌తో వచ్చిన నాలుగు కేజీల మినుములు విత్తన ప్యాకెట్‌ను రూ.56 చెల్లించి పొందవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.ఆదర్శ రైతు జాన్నల శ్రీనివాసు కుమార్, వార్డ్ మెంబర్ చిక్కాల బూరయ్య, తెల్లం చిన్నాలమ్మ, కేతమల వెంకన్న బాబు,కొమరం నాగ బాబు దొర, తుర్రం తాతాజీ దొర, కలుం వెంకన్న దొర, కారం బాపన్న దొర, తెల్లం సోమన్న దొర, తుర్రం శివశంకర్ దొర, కుంజం రోహిణి, శారపు పార్వతి పాల్గొన్నారు.

దేవీపట్నం రోడ్డులో మద్యం దుకాణాలు వద్దు

ప్రజాశక్తి - రంపచోడవరం : గ్రామంలో అంబేద్కర్ సెంటర్ నుండి హాస్పిటల్ వరకు ఎటువంటి మద్యం దుకాణాలను షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవిని రంపచోడవరం పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కెఎల్ఎన్ గురుప్రసాద్ కోరారు. ఈ రోడ్డులో హైస్కూలు, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు రాకపోకలు సాగిస్తారని, మందుబాబుల ఆగడాలతో వారు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. దీనిపై గత ప్రభుత్వంలో అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు కనీసం ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనైనా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తగుచర్యలు చేపట్టాలని కోరారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి - సీలేరు: సీలేరులో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దేవిసన్నిధిలో ప్రజల ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఏపి జెన్‌కో ఎస్ఇ సివిల్ రాంభద్ర రాజు, ఇఇ సివిల్ శ్రీనివాసరెడ్డి, పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఇన్స్పెక్టర్ వికాస్ పాండే అన్నదానాన్ని ప్రారంభించారు. సీలేరు మేజర్ పంచాయతీ పరిధి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో అన్న సమారాధనలో పాల్గొన్నారు.

18న కార్మిక వ్యతిరేక విధానాలపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 18న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య తెలిపారు. మంగళవారం జ్ఞానాపురం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సదస్సును విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. కేంద్ర సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో దూకుడుగా కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల శ్రమ శక్తిని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొొచ్చి కార్మికులను మరింత దోపిడీకి గురిచేసి అభద్రతలోకి నెట్టే పరిస్థితిని తీసుకొొచ్చిందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖలో రెగ్యులర్ జెసిఎల్‌ను కార్మిక శాఖలో నియమించకపోవడం దారుణమన్నారు